ఊరూరా ఉట్ల పండుగ

- జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు
- ఉత్సాహంగా ఉట్టి కొట్టిన యువకులు

శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. యువకులు ఉత్సాహంగా ఉట్టికొట్టి రంగులు చల్లుకున్నారు. ఈ సందర్భంగా ' కెరటాల అడుగున కనుచూపుమరుగున నిద్రపోతున్నది ద్వారకా' అనే డీజే పాటలతో వీధులు మార్మోగాయి.


వేలేరు : పూజలు చేస్తున్న భక్తులు


పరకాల : బ్రహ్మకుమారీ సెంటర్‌లో..


శాయంపేట : ప్రధాన చౌరస్తాలో ఉట్టికొడుతున్న యువకులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల నాగార్జున స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణతో అలరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే పోటీలను నిర్వహించగా బస్వోజు శ్రీరామ్ తేజ మొదటి స్థానంలో నిలిచి రూ. 10,16 నగదు పురస్కారం అందుకున్నాడు. ద్వితీయ స్థానంలో మడికొండ లభిరాం రూ.516, తృతీయ స్థానంలో మోరే రాణా ప్రతాప్ రూ.3,16, కన్సోలేషన్ బహుమతి పల్లె బోయిన వర్షిత్ రూ.216 అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ గుర్రం అశోక్, ప్రిన్సిపాల్ వినీశ్, ఉపాధ్యాయులు రమేశ్, రజని, శైలజ, మానస, నాలి, కోమల, వనజ పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో పద్మశాలి యువసేన ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్ల వద్ద ఉట్లుకొట్టి సంబురాలు జరుపుకొన్నారు. పద్మశాలి యువసేన అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు దేవరాజ్, కోశాధికారి రాజేశ్, సహాయ కార్యదర్శి రాజు, యువకులు తిరుపతి, భాస్కర్, సుమన్, రాజు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. దామెరలోని దామేశ్వరాలయలంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ ఈ–టెక్నో స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య పాల్గొని పలు సూచనలు చేశారు. శ్రీకృష్ణుడి భోధనలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. చిన్నారులు శ్రీకుష్ణుడు, గోపికల వేషధారణ ధరించి అలరించారు. అలాగే మండల కేంద్రంలోని మత్స్యగిరిస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఘనంగా నిర్వహించారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఎల్కతుర్తి మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు యువకులు ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. ఉట్టిని కొట్టేందుకు ఉత్సాహం కనబర్చిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ పరకాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆధ్యాత్మిక నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.


దామెర : కృష్ణుడు, గోపికల వేషధారణలో డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు



శాయంపేటలో..


ఎల్కతుర్తిలో..

వేలేరులో..

వేలేరు : మండలంలోని పీచరలో శ్రీకృష్ణుడి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

క్లుప్తంగా

భీంపల్లి వాసికి డాక్టరేట్



కమలాపూర్ : మండలంలోని భీంపల్లికి చెందిన గిర్నాల శారదకు ఫిజిక్స్‌లో ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆమె 2017 సంవత్సరంలో ఓయూలో పీహెచ్‌డీ ప్రవేశం పొంది 2023 సంవత్సరంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఓయూ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో శారద 'ఎఫెక్ట్ ఆఫ్ రేర్ ఎర్త్ డోపింగ్ ఆన్ స్ట్రక్చరల్, స్పెక్టరల్ మ్యాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ కోబాల్ట్ ఫెర్రిట్స్' అనే పరిశోధనా గ్రంథాన్ని సమర్పించడంతో యూనివర్సిటీ అధికారులు ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, జులైవాడ, రోహిణి ఆస్పత్రి, సుబేదారి మెయిన్ రోడ్డు, శ్రీకృష్ణ ఆస్పత్రి ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సెప్టెంబర్ 27న 'చలో ఢిల్లీ'

నయీంనగర్: కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని సెప్టెంబర్ 27న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్‌బీఎం అధ్యక్షుడు కె.అనిల్ కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేయనున్న దీక్షకు పలు కుల సంఘాలు, అనుబంధ సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, అనిల్, ఉదయ్‌కుమార్, సాంబయ్య, కరుణ, సంపత్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

హసన్‌పర్తి: ఇటీవల మరణించిన గోపాలపురం కృష్ణకాలనీకి చెందిన బొమ్మ వెంకటయ్య గౌడ్ కుటుంబాన్ని సర్వాయి పాపన్న గౌడ్ సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. ఈమేరకు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ సంఘం అధ్యక్షుడు కూనూరు వెంకట్వేర్‌గౌడ్ మాట్లాడుతూ నిరుపేద గౌడ కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వల్లాల రాజుగౌడ్, పంజాల ఓదెలు, మహేందర్, అనిల్, కిశోర్, కర్ణాకర్, గొల్లపల్లి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

దోషులకు ఉరిశిక్ష విధించాలి

హన్మకొండ చౌరస్తా: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన దోషులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. దేశంలో రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు, యువతులు, మహిళలకు రక్షణ కరువైందని వాపోయారు. వేదిక జిల్లా కన్వీనర్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో అలంకార్ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో డాక్టర్లు అనీస్ సిద్దిఖీ, రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

రామన్నపేట: ఆటోలో ఓ మహిళా మరిచిపోయిన బ్యాగును పోలీసులకు అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. కాశిబుగ్గకు చెందిన ఆటో డ్రైవర్ కదిరాల కిరణ్ తన ఆటోలో సోమవారం ఉదయం కాశిబుగ్గ శివాలయం నుంచి ఒక మహిళను ఆమె కుటుంబ సభ్యులను ఎక్కించుకొని హనుమకొండ పెట్రోల్ పంపు దగ్గర దింపాడు. ఆటో దిగే సమయంలో సదరు మహిళా తన బ్యాగును అందులోనే మర్చిపోయిన విషయాన్ని కొంతసేపటికి గమనించిన ఆటో డ్రైవర్ కిరణ్.. వెంటనే ఆ బ్యాగును ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగులో సుమారు 2తులాల బంగారు ఆభరణాలు, రూ.17,500 నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, సదరు మహిళ ఇంకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని, బాధితురాలిని గుర్తించి అప్పగిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి: వివిధ ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, వాటిని విక్రయించడానికి తీసుకెళ్తున్న ఓ ముఠా పోలీసులకు చిక్కింది. వారి వద్ద నుంచి ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి




ఆత్మకూరు : మండల కేంద్రంలోని మహిమాన్వితమైన మహాదేవ పంచకూట శివాలయ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివాలయ నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణ తీరును కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో ఫ్లోరింగ్, వాష్‌రూమ్స్, లైటింగ్ తదితర పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పనులను పూర్తి చేయించాలని కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సిరిపురం సంపత్, రేవూరి దేవేందర్‌రెడ్డి, పరికిరాల వాసు, రేవూరి జయ్‌పాల్‌రెడ్డితో తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పద్మశాలి పరపతి సంఘం సభ్యురాలు కందగట్ల సౌందర్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. కాగా సోమవారం సంఘ సభ్యులు రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందగట్ల ప్రకాశం, ఉపాధ్యక్షుడు కుసుమ రమేశ్, మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, సభ్యులు సూర్యనారాయణ, నవీన్, పరామత్మ, హరికృష్ణ, మహేశ్, శ్రీనాథ్, రాజేశ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

సెంట్రల్ లైటింగ్ బాగుచేయరూ..



మున్సిపాలిటీ పరిధిలోని వెల్లంపల్లి రోడ్డులో గల సెంట్రల్ లైటింగ్స్ వెలుగడం లేదు. దీంతో రోడ్డంతా చీకటిమయంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - హన్మకొండ (పరకాల)

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : కె.నర్సింహ, మున్సిపల్ కమిషనర్
ఫోన్‌నంబర్ : 7993361942

జిల్లాస్థాయి క్రీడాపోటీలు

కాశిబుగ్గ: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఓ సిటీ స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి ఆహ్వానిత క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్ఓ) సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, రెజ్లింగ్, జూడో, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా 29న నగరంలోని వెంకట్రామ జంక్షన్ నుంచి ఓ సిటీ స్టేడియం వరకు క్రీడా ర్యాలీ నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

ఫలితాలు విడుదల చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ కేయూ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ పీజీ వివిధ ఉన్నత విద్యకోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరగుతోందని తెలిపారు. ఫలితాలు త్వరగా రాకపోవటంతో పీజీ తదితర ఉన్నత విద్యకోర్సుల్లో ప్రవేశాలు పొందలేని దుస్థితి నెలకొందని తెలిపారు.

బ్రిడ్జిపై గుంతల పూడ్చివేత

కాజీపేట అర్బన్: సాక్షి దినపత్రికలో ఈనెల 18వ తేదీన ప్రచురితమైన బ్రిడ్జి ఎక్కితే వణకు అనే కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ఈమేరకు కడిపికొండ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు సోమవారం మరమ్మతులు చేపట్టారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం


నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

ఐనవోలు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. మండలంలోని ఒంటి మామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ వెంకటనారాయణ, మజ్జిగ రంజిత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు నకిరెకంటి మోహన్‌గౌడ్, యాకూబ్ పాషా, గిరుక రాజు, మజ్జిగ శ్రీకాంత్, ఆడెపు రమేశ్, కడుదూరి తిరుపతి, మీరాల సమ్మయ్య, మహేందర్, రాజారపు రాజ్‌కుమార్, మజ్జిగ వెంకన్న, ఏటూరి ప్రసాద్ ఉన్నారు.


పరామర్శిస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

టెస్కాబ్ చైర్మన్ పరామర్శ

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి రామస్వామిగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన బొల్లపల్లి శేఖర్‌గౌడ్ అనారోగ్యంతో, పంథిని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త కరిముళ్ల పూర్ణచందర్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా ఇరువురిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి, మండల నాయకులు సంపత్ కుమార్, మధు, దయాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోవాలి

మడికొండ: రౌడీ షీటర్లు తమ పద్ధతి మార్చుకొని సక్రమంగా నడుచుకోవాలని మడికొండ ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్ హెచ్చరించారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు సహకరించాలని, ఎలాంటి తగాదాల్లో తలదూర్చవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు ఆర్ఓఆర్ వర్తింపజేయాలి


మాట్లాడుతున్న కలకోటి మహేందర్

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న ఆర్ఓఆర్ –2024 చట్టాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 32విలీన గ్రామాలకు వర్తింపజేయాలని న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అసైన్డ్ భూమి సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదాబైనామాల ద్వారా భూమి కొనుగోలు చేసిన రైతులకు అవకాశం కల్పించి, పట్టాదారు పాస్‌బుక్కులు జారీ చేయాలన్నారు. పట్టా, అసైన్డ్, ఇనాం, భూదాన్ భూములను కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా క్రమబద్ధీకరించడానికి అవకాశం కల్పించాలని సూచించారు. కొత్త చట్టం అమలు కోసం ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకోవాలని, అందుకు రెండు నెలల గడువు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, రైతు సంఘం నాయకుడు నేరెళ్ల బస్వరెడ్డి, ఏబీఎస్ నాయకులు పోలెపాక మల్లేశం, మోరే ఐలయ్య, కొలిపాక రమేష్, మంద ప్రశాంత్ పాల్గొన్నారు.

కోదండరామ్‌కు విద్యాశాఖ మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న కలకోటి మహేందర్

కేయూ క్యాంపస్: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవి కేటాయించాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కోదండరాంకు ఎమ్మెల్సీగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కోదండరాంకు విద్యాశాఖమంత్రి పదవి ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కుర్తా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, కోశాధికారి ప్రొఫెసర్ వీరన్న, జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ సుధాకర్, ప్రొఫెసర్ సమ్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నూతన కమిటీ ఎన్నిక


రజనీకాంత్, అధ్యక్షుడు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో ఆదర్శ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కూరి రజినీకాంత్, గౌరవ అధ్యక్షులుగా కట్కూరి రాజు, కట్కూరి సునీల్, ఉపాధ్యక్షులుగా కట్కూరి సృజన్, పోలేపాక మహేశ్, ప్రధానకార్యదర్శిగా పోలేపాక రాజేశ్, కోశాధికారులుగా కట్కూరి వంశీ, మాదాసు హరీశ్, ప్రచారకార్యదర్శిగా ఇల్లందుల ఆర్యను ఎన్నుకున్నారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులుగా గుర్రపు సాంబయ్య, కట్కూరి హరీశ్, కట్కూరి నెల్సన్, కట్కూరి నాని, బొక్కల నరేశ్, కట్కూరి చక్రి, చెర్రిని నియమించారు.

భజన మండలి సభ్యుల నగర సంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామ ఆంజనేయ భజన మండలి సభ్యులు, శ్రీ రామదాసు భజన జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు ఆధ్వర్యంలో శ్రావణమాసం, శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రతి వీధిలో భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ స్వామి వారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. హిందూ ధర్మ ప్రచార పరిషత్, శ్రీరామదాసు భజన మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర స్వామి ఆదర్శ ఆదేశాల మేరకు తొమ్మిది సంవత్సరాలుగా శ్రావణమాసంలో నెల రోజుల పాటు గ్రామాల్లో నగర సంకీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తడక సదానందం, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

దామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



దామెర : మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో శ్రావణ సోమవారాన్ని పుస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి 11 కిలోల విభూది, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రాక్షలు, పూలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల రాజుశర్మ వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలం కృపాకర్‌రెడ్డి, ప్రముఖ అడ్వొకేట్లు పోల్సాని అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగీ జ్వరంతో బాలిక మృతి

ధర్మసాగర్: డెంగీ జ్వరంతో ప్రవళిక (11) అనే చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని తాటికాయల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు పెసరు స్వామి కూతురు ప్రవళికకు నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని రెయిన్‌బో హాస్పిటల్లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. స్వామికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు కూడా జ్వరంతో బాధపడుతుండడం గమనార్హం.

గ్రామంలో విజృంభిస్తున్న జ్వరాలు

తాటికాయల గ్రామంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే సుమారు 20 మంది వరకు జ్వరాన బారిన పడి వైద్యం పొందుతున్నారు. అందులో కొందరు డెంగీతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపి, మెడికల్ క్యాంప్ పెట్టించాలని కోరుతున్నారు.

ఉపాధి కల్పనకు ఎగ్ కార్ట్స్



కాశిబుగ్గ: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పనకు జాతీయ కోడిగుడ్ల సమన్వయ సంఘం (ఎన్ఈసీసీ) కృషి చేస్తోందని ఎన్ఈసీసీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తెలిపారు. ఓసిటీలోని తన నివాసంలో 50 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఎగ్ కార్ట్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్ట్ ఎగ్ కార్ట్స్ ద్వారా యువత ఉపాధి పొంది ఇతరులకు మార్గదర్శకం కావాలని సూచించారు. ఎన్ఈసీసీ సీఓఓ డాక్టర్ అన్నామలై ఏజిల్‌కుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారమైన గుడ్లను తింటూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు.